

ఏటూరునాగారంలో బస్సు డిపోకు కేటాయించిన స్థలం



కమలాపురంలో బిల్టు ఫ్యాక్టరీ

# బస్‌డిపో, బిల్ట్ ఫ్యాక్టరీలకు మోక్షం ?

- బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయంపై ఆధారం
- నిర్లక్ష్యం చేసిన గత పాలకులు
- ఆశాభావం వ్యక్తం చేస్తున్న కార్మికులు
- మాట తప్పని సీఎం కేసీఆర్

ములుగు (నమస్తే తెలంగాణ), ఏటూరునాగారం, నవంబర్ 29 : ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు బీఆర్‌ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి గెలుపుతో ముడిపడి ఉన్నాయి. నాగజ్యోతిని గెలిపిస్తే ఏటూరునాగారంలో బస్ డిపో ఏర్పాటు, బిల్టు ఫ్యాక్టరీని తెరిపిస్తామని కేటీఆర్ రెండు రోజుల క్రితం జరిగిన రోడ్‌షోలో హామీ ఇచ్చారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి అజ్మీరా చందులాల్‌ను గెలిపిస్తే ములుగును జిల్లాగా చేస్తామని 2018 ఎన్నికల సభలో సీఎం కేసీఆర్ ప్రకటించారు. అయితే ఎన్నికల్లో చందులాల్ ఓడిపోయినా ఇచ్చిన మాట ప్రకారం కేసీఆర్ ములుగును జిల్లా చేశారు. ములుగుపై కేసీఆర్‌కు ఉన్న అపార ప్రేమతో జిల్లాగా ప్రకటించడమే కాకుండా మెడికల్ కాలేజీని మంజూరు చేశారు. అలాగే మున్సిపాలిటీగా ప్రకటించారు. అంతే కాకుండా ములుగుపై వరాల జల్లు కురిపించారు. ఏటూరునాగారాన్ని రెవెన్యూ డివిజన్‌గా, మల్లంపల్లిని మండలం చేయనున్నట్లు ప్రకటించారు. ఏటూరునాగారంలో అగ్ని మాపక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక ఏటూరునాగారంలో బస్‌డిపో ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎంతో కాలంగా ఉంది.

### రోడ్‌షోలో కేటీఆర్ హామీ

రెండు రోజుల క్రితం రోడ్‌షోలో ఏటూరునాగారంలో బస్ డిపో ఏర్పాటు చేయాలనే విన్నపాన్ని బడే నాగజ్యోతి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి వెంటనే స్పందించి గత ఎన్నికల్లో తమ అభ్యర్థి ఓటమి చెందినా సీఎం కేసీఆర్ జిల్లాను ప్రకటించారన్నారు. నాగజ్యోతిని గెలిపిస్తే తప్పకుండా ఈసారి బస్‌డిపో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా మంగపేట మండలం కమలాపురంలో 1980లో బిల్ట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. 2014లో ఇక్కడ ఉత్పత్తి అయ్యే పల్ప్‌కు మార్కెటింగ్ సరిగా లేదనది ఉత్పత్తి నిలిచిపోయింది. 2015లో దీనిని గుర్తించిన ప్రభుత్వం ఫ్యాక్టరీ పునరుత్పాదన సాధించేందుకు అవసరమైన కలప, బొగ్గు విద్యుత్‌పై రూ. 250 కోట్ల రాయితీని ప్రకటించింది. అయినా ఫ్యాక్టరీ తెరుచుకోలేదు. ఫ్యాక్టరీలో 750 మంది పర్మినెంట్, 320 మంది పీఎఫ్, 400 మంది దినసరి వేతన కూలీలతో పాటు పరోక్షంగా మరో 500 మంది వరకు ఉపాధి పొందారు. బిల్ట్ ఫ్యాక్టరీ మూత పడడంతో ఇక కమలాపురం పూర్తిగా నిర్మానుష్యంగా మారింది. ఉపాధి కోల్పోయిన అనేక మంది కూలీలుగా మారారు. ఫ్యాక్టరీలోని యంత్రాలు పూర్తిగా దెబ్బతిని తుప్పు పట్టిపోతున్నాయి. ఎంతో మంది కార్మికులకు ఆధారమైన ఈ ఫ్యాక్టరీని తెరిపించాలనే డిమాండ్ ఉన్న ఆచరణలో సాధ్యం కాలేదు. ఇక ఈ విషయాన్ని కూడా నాగజ్యోతి రోడ్ షోలో కేటీఆర్ దృష్టికి తీసుకుపోయారు. అది కూడా నాగజ్యోతి గెలిచిన తర్వాత ఫ్యాక్టరీ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. నాగజ్యోతి విజయం తర్వాత పునఃప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నట్లు కార్మికులు భావిస్తున్నట్లు సమాచారం.

### పలు సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం

వీటితో పాటు వరద ముంపు ప్రాంతాల్లో మోడల్ కాలనీలు, ముల్లకట్ట నుంచి అకినేపల్లి మల్లారం వరకు గోదావరి వరద కరకట్ట నిర్మిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఏటూరునాగారం ప్రాంత అభివృద్ధికి బాటలు పడేలా ఇచ్చిన హామీలు నెరవేరాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతిని గెలిపించాలనే వాదన జోరుగా కొనసాగుతోంది. అనేక మందికి ఉపాధి కల్పించే బిల్ట్ పరిశ్రమ తెరుచుకోవడం, బస్‌డిపోతో రవాణా సౌకర్యాలు మెరుగుపడే అవకాశాలు ఉండడంతో నియోజకవర్గంలోని ఓటర్లలో ప్రధాన చర్చ కొనసాగుతుంది. నేడు ఓటరు తీసుకునే నిర్ణయంపై బిల్ట్ ఫ్యాక్టరీ, బస్‌డిపో ఏర్పాట్లు ఆధారపడి ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

### గతంలో స్థలం కేటాయింపు

మండల కేంద్రంలోని ఆకులవారి ఘనపూర్‌లో బస్టాండుకు స్థలం కేటాయించి నిర్మాణం పూర్తి చేశారు. ఇది గ్రామానికి దూరంగా ఉండడంతో వినియోగంలోకి రాలేదు. తర్వాత బస్ డిపో ఏర్పాటు చేయాలనే డిమాండ్ బల పడింది. 1996లో బస్ డిపో మంజూరు చేశారు. బస్టాండ్ స్థలాన్నే డిపో ఏర్పాటుకు కేటాయించారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు బస్ డిపో ఏర్పాటు చేసేందుకు అడుగులు ముందుకు వేయక ఎక్కడి గొంగళి అక్కడే ఉంది. గత ఎన్నికల ముందు డిపో నిర్మాణం కోసం రూ. 1 కోటిని సీడీఎఫ్ నుంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. తర్వాత జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి చందూలాల్ ఓటమి పాలయ్యారు. దీంతో పట్టించుకునే వారు కరువై వెనుకబడి పోయింది. తెలంగాణ ప్రభుత్వం ములుగు జిల్లాకు వరాలు కురిపిస్తున్న నేపథ్యంలో మళ్లీ బస్‌డిపో తెరపైకి వచ్చింది.

ప్రమాదంలో దెబ్బతిన్న కారు



## కారు- ట్రాక్టర్ ఢీ

ఏటూరునాగారం, నవంబర్ 29 : మండలంలోని చిన్నబోయినపల్లి సమీపంలో బుధవారం ట్రాక్టర్, కారు ఢీ కొన్నాయి. బాధితులు హైదరాబాద్ నుంచి కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామానికి కారులో వస్తున్నారు. కాగా, చిన్నబోయినపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ట్రాలీని కారు ఢీ కొట్టింది. దీంతో కారు ముందు భాగం దెబ్బతింది. ట్రాలీ బోల్తా పడింది. కారులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

# ఎన్నికలకు సర్వం సిద్ధం

- నేడే పోలింగ్
- కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాం
- తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య

మహదేవపూర్, నవంబర్ 29 : మండలంలోని పోలింగ్ బూత్‌లలో ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు బుధవారం తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య తెలిపారు. మండలంలో మొత్తం 34 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో 24,489 ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఆయా గ్రామాలకు పోలింగ్ సిబ్బంది చేరుకున్నారన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.



కాటారం : నస్తూర్‌పల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు, సిబ్బంది

### కాటారంలో..

కాటారం : మండలంలోని 36 పోలింగ్ కేంద్రాల్లో గురువారం శాసనసభ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కాటారం తహసీల్దార్ నాగరాజు బుధవారం తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద అన్ని వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. మండలంలో 5 రూట్ల ద్వారా పోలింగ్ సిబ్బంది, ఎన్నికల సామగ్రి, ఈవీఎంలు, వీవీ ప్యాట్ యంత్రాలను తరలించినట్లు వివరించారు.




మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీరాజయ్య

## డిసెంబర్ 2 వరకు టెన్త్ పరీక్ష ఫీజు గడువు

**డీఈవో ఎన్ రాంకుమార్**

భూపాలపల్లి రూరల్, నవంబర్ 29 : పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫీజును డిసెంబర్ 2 వరకు చెల్లించవచ్చని డీఈవో ఎన్ రాంకుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబర్ 12 వరకు, రూ.200తో డిసెంబర్ 21 వరకు రూ.500 ఆలస్య రుసుముతో జనవరి 3 వరకు చెల్లించవచ్చని తెలిపారు. ఈ విషయాన్ని హెచ్‌ఎంలు పదో తరగతి విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు.

## చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

మహాముత్తారం, నవంబర్ 29 : చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అజ్మీరా రవీందర్ నాయక్ (41) ఊరకుంట చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. లోతుకు వెళ్లి నీటిలో మునిగి ఊత రాకపోవడంతో మృతి చెందాడు. మృతుడి తమ్ముడు జైపాల్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## మద్యం పట్టివేత

కాటారం, నవంబర్ 29 : మండలంలోని గంగారం గ్రామంలో బుధవారం ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన మద్యం బాటిళ్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ ప్రశాంతి తెలిపారు. 25 బ్లెండర్ స్ప్రైడ్ క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ చేసినా, విక్రయించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఎక్సైజ్ ఎస్సై గంగాధర్, సిబ్బంది ఉన్నారు.



పట్టుకున్న మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ సీఐ ప్రశాంతి



నగదు, బియ్యం అందిస్తున్న సంఘం సభ్యులు

## ఆర్థిక సాయం అందజేత

ఏటూరునాగారం, నవంబర్ 29 : స్థానిక పీఏసీఎస్ అటెండర్ మహమ్మద్ దార్ సాహెబ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబానికి జిల్లా యూనియన్ తరఫున రూ. 35వేల నగదుతో బియ్యంను అందజేశారు. విరాళాలు సేకరించి బాధిత కుటుంబానికి అందజేసినట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో టీ తిరుపతి, దిలీప్, శంకరయ్య, ఎన్ తిరుపతి, స్వాతి, గౌరమ్మ, రంగారావు, సత్యనారాయణ, ఆర్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న బుగులోని జాతర

- మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ప్రభ బండ్లు

రేగొండ, నవంబరు 29 : మండలంలోని తిరుమలగిరి శివారులో బుగులోని జాతర కొనసాగుతున్నది. బుధవారం నాలుగవ రోజు భక్తుల సందడి నెలకొంది. పాండవుల గుట్ట గోవింద నామస్మరణతో మార్మోగాయి. ప్రభ బండ్లు ఇప్పచెట్టు చుట్టూ ప్రదక్షిణ చేశాయి. జాతరలో ప్రభ బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆదివారం సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దైవ దర్శనం కోసం భక్తులు గంటల తరబడిగా క్యూలో వేచియున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో బిల్లు శ్రీనివాస్, దేవాదాయ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, మాజీ చైర్మన్ కడారి జనార్దన్, సర్పంచ్ కట్టు రాణీ మధుసూదన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది కోరాజు రవీందర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**PUBLIC NOTICE**

ఇందుమూలముగా నా క్లయింటు M/s Shriram Finance Limited, Tirumalagiri బ్రాంచి వారు ఇచ్చిన బోగోట్టా ప్రకారము యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్థిని రిజిష్టరు తనఖా చేయించుకొని **శ్రీ/శ్రీమతి మన్నూరు జయమ్మ, భర్త: సోమయ్య గారికి** ఋణము యిచ్చుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్థిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు, చార్జీలు, క్లయిములు, తనఖాలు, అగ్రిమెంటు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న ఎడల నేటి నుండి (7) ఏడు దినములలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింటు భాద్యులు కారు.

**SCHEDULE OF THE PROPERTY**

దేవరుప్పుల రెవెన్యూ గ్రామము, కామారెడ్డి గూడెం గ్రామపంచాయతి, దేవరుప్పుల మండలం, జనగామ జిల్లా, జాయింట్ సబ్ రిజిష్ట్రార్-5, జనగామ జిల్లా రిజిష్ట్రార్, వరంగల్ పరిధిలో గల గ్రా.పం. నెం. 6-19/5 (పాత) లేక 6-49/13/B (కొత్త) ఖాళీస్థలం విస్తీర్ణం: 121.00 చ.గ.లు దీనికి సరియగు 101.15 చ.మీ.లు గల దానికి హద్దులు: తూర్పు: మన్నూరు సోమయ్య గారి ఖాళీస్థలం, పడమర: మన్నూరు మాణిక్యం గారి గృహము నెం. 6-19/6, ఉత్తరం: సూర్యాపేట-జనగామ 100 ఫీట్ల వెడల్పు పి.డబ్ల్యూ.డి రోడ్డు, దక్షిణం: కంచర్ల కొండయ్య గారి ఖాళీస్థలం.

Sd/- **NALLELLA SURENDER, NALLELLA SUHAS**
ADVOCATES,
H.No. 1-8-489, Haritha Residency, Balasamudram,
HANAMKONDA, Warangal. Cell: 9849365117